



గ్యాస్ సిలిండర్ మోస్తున్న డీసీఎం డీకే శివకుమార్



ఎడ్లబండిపై విజయేంద్ర

రోడ్డెక్కిన నేతలు

- అన్ని పార్టీలు ఆందోళన బాటే..
- గ్యాస్ ధరల పెంపుపై కాంగ్రెస్ నిరసన
- కొనసాగుతున్న బీజేపీ జనాక్రోశ యాత్ర
- జేడీఎస్, ఆప్ మరోవైపు..

7



జనాక్రోశ యాత్ర వేదికపై బీజేపీ నాయకులు



సిలిండర్‌కు పూలమాల వేస్తున్న సీఎం సిద్దరామయ్య

రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రత్యర్థులను విమర్శించేందుకు నిరసనలను వేదికలుగా మార్చుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ జానాక్రోశ యాత్రలలో కేంద్రమంత్రులు ప్రహ్లాద్‌జోషి, సోమణ్ణలు పాల్గొనగా, జేడీఎస్ పార్టీ ఈ పాలన వద్దంటూ నిరసనలో కేంద్ర మంత్రి కుమారస్వామి భాగస్వామ్యులయ్యారు. తాజాగా కేంద్రప్రభుత్వం నిత్యావసర ధరలు పెంచిందంటూ గురువారం ఫ్రీడం పార్కులో జరిగిన నిరసనలో సీఎం, డీసీఎంసహా మంత్రులందరూ పాల్గొన్నారు. ఆప్ కాంగ్రెస్, బీజేపీల విధానాలకు వ్యతిరేకంగా నిరసన చేసింది.

రికార్డుల సుబ్రహ్మణ్యం..!

- ఆదాయంలో కుక్కె సుబ్రహ్మణ్యుడి రికార్డు
- ఏడాదిలో రూ.155.95 కోట్లు

బెంగళూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కుక్కె సుబ్రహ్మణ్య ఆలయం ఆదాయంలో మరోసారి రికార్డు నెలకొల్పింది. ఇక్కడ రాహు, కేతు సర్ప దోష నివారణకోసం భక్తులు ఎక్కువగా వస్తుంటారు. దక్షిణకన్నడ జిల్లా కడబ తాలూకాలో కొలువైన కుక్కె సుబ్రమణ్య ఆలయాన్ని దర్శించే భక్తులు ఏటా పెరుగుతున్నారు. 2024-25లో వార్షిక ఆదాయం రూ.155.95 కోట్లుగా ఉంది గత ఏడాది వార్షిక ఆదాయం రూ.146.01 కోట్లుగా ఉండేది. దీంతో ఈసారి 9.94 కోట్లు అధికంగా ఉంటూ రాష్ట్రంలో శ్రీమంత దేవస్థానంగా నిలిచింది. రాష్ట్రంలో 'శక్తి' పథకం అమలులో ఉండడంతో ఉచిత ప్రయాణం కారణంగా ఆలయాలను సందర్శించే భక్తుల సంఖ్య అధికమైంది. ఇదికూడా ఆదాయం పెరిగేందుకు కొంత దోహదపడిందనే అభిప్రాయం ఉంది. దేవదాయ ధర్మాదాయశాఖ పరిధిలో కుక్కె సుబ్రమణ్య ఆలయం ఉన్న విషయం విదితమే.



కుక్కె సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద భక్తులు

రణగణన..!



- ఎటూ తేలని కులగణన
- కేబినెట్‌లో కుదరని ఏకాభిప్రాయం
- మంత్రివర్గ సమావేశం వాయిదా
- ఒక్కలిగ, లింగాయత మంత్రులు ససేమిరా

బెంగళూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పదేళ్లకిందట జరిగిన సామాజిక, ఆర్థిక, విద్యారంగాలకు సంబంధించి బీసీ కమిషన్ ద్వారా జరిగిన కులగణన నివేదిక విషయంలో మంత్రివర్గం ఎటూ నిర్ణయం తీసుకోలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన గురువారం సాయంత్రం కులగణన నివేదికపై చర్చించేందుకు ప్రత్యేకంగా మంత్రివర్గ సమావేశం జరిగింది. కులగణనం కాస్త కేబినెట్‌లో రణగణనంగా మారినట్లు తెలుస్తోంది. కులగణన నివేదికపై మంత్రులందరూ సమష్టి నిర్ణయం తీసుకుంటారని భావించినా భిన్నాభిప్రాయాలతోనే ముందుకెళ్లారు. సాయంత్రం ప్రారంభమైన మంత్రివర్గ సమావేశం సుదీర్ఘంగా సాగవచ్చునని మంత్రులందరూ వారి అభిప్రాయాలను వ్యక్తం చేసి నివేదికలోని లోటుపాట్లను సరిదిద్దుతారనే అభిప్రాయాలు ఉండేవి. తొలుత సీఎం సిద్దరామయ్య కులగణన ప్రాధాన్యం, ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయాలు, కాంగ్రెస్ పార్టీ ఇటీవల లోక్‌సభ ఎన్నికల వేళ ప్రకటించిన హామీలను గుర్తు చేసినట్లు సమాచారం. అంతలోనే ఎవరికి వారు అభిప్రాయాలను వ్యక్తం చేసే సందర్భంలో గందరగోళంగా మారిన మేరకు ఒక్కొక్కరుగా వారి ఆలోచనలు, అవగాహనలు పంచుకోవాలని సీఎం సూచించినట్లు తెలుస్తోంది. ఒకరిద్దరు మంత్రులు పదేళ్ళగా సాగిన ప్రక్రియ సుదూరమే ప్రయాణించామని ఇప్పుడు వెనకడుగు సరికాదని తేల్చినట్లు సమాచారం. అంతలోనే ఉద్యానవనశాఖా మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున వంతు రావడంతో ఎట్టి పరిస్థితిలోను నివేదికను అంగీకరించేలమంటూ తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. అంతలోనే డీసీఎం డీకే శివకుమార్ కూడా నివేదిక అంగీకరించే పరిస్థితి లేదని వివరించినట్లు తెలిసింది. ఇలా ఎవరికి వారుగా కనీసం అభిప్రాయాలను వ్యక్తం చేయకుండా సాధ్యంకాదనే రీతిలో మాట్లాడటంతో పరిస్థితి భిన్నంగా మారనుందని సీఎం సిద్దరామయ్య సభను వాయిదా వేశారు. మంత్రివర్గ భేటీ సుమారు రెండున్నరగంటలకు పైగా జరిగినా కనీస స్థాయిలో చర్చలు జరుగలేదని తేలింది. కులగణన కోసమే ప్రత్యేకంగా ఏర్పాటైన సభ ప్రత్యేక కేబినెట్‌లో కనీసం మంత్రులందరూ అభిప్రాయాలు వ్యక్తం చేయలేదనేది తేలింది. 2015 ఏప్రిల్‌లో జరిగిన కులగణన నివేదికను 2024 ఫిబ్రవరిలో బీసీ కమీషన్ ఛైర్మన్ ప్రభుత్వానికి సమర్పించింది. 14నెలల తర్వాత ఇదే నెల11న శుక్రవారం కేబినెట్‌లో కులగణన నివేదికను స్వీకరించారు. సీల్డ్‌కవర్‌లోని నివేదికను మంత్రులకు అందించి 17న ప్రత్యేక మంత్రివర్గంలో నిర్ణయం తీసుకుందామని తేల్చారు. వారం రోజులుగా మంత్రులు ఎవరి దారిలో వారు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. కేవలం మంత్రుల చెంతన మాత్రమే నివేదికలు ఉన్నా అంతా బహిరంగం అనేలా గణాంకాలు బయటకు వచ్చాయి. ఎస్సీ, ఎస్టీ బీసీ సమాజానికి చెందిన మంత్రులు నివేదికను స్వీకరించేలా అభిప్రాయపడ్డారు. ఒక్కలిగ, లింగాయత సముదాయానికి చెందిన మంత్రులపై కులసంఘాలు, స్వామీజీల నుంచి తీవ్రమైన ఒత్తిడి వచ్చింది. ఇవే అభిప్రాయాలతో కేబినెట్‌కు వెళ్ళిన మంత్రులు ముందుగానే నిర్ణయించుకున్న అంశాలకు అనుగుణంగానే మాట్లాడారు. కేబినెట్ ముగిశాక మంత్రులు ఎటువంటి వ్యతిరేకత వ్యక్తం కాలేదని అంటున్నా మంత్రులందరి అభిప్రాయాలకు తావులేకుండానే ఎందుకు వాయిదా వేసినట్లు అనే ప్రశ్న వస్తోంది. ఇక ఒక్కలిగ, లింగాయత మంత్రులు ఎట్టి పరిస్థితిలోను అంగీకరించలేమని తేల్చి చెప్పడమే వాయిదా కు కారణమనే అభిప్రాయాలు ఉన్నాయి. కేబినెట్ నుంచి బయటకు వచ్చిన మంత్రులు ఒక్కరోజులోనే తీర్మానం ఎలా సాధ్యమని మరో రెండుమూడు కేబినెట్ భేటీలు జరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

2న మరోసారి కేబినెట్ భేటీ

కులగణన నివేదిక విషయంలో ఎటూ తేలక పోవడంతో కేవలం ఇదే అంశంపై చర్చించేందుకు మే 2వ తేదీన కేబినెట్ భేటీ నిర్వహించాలని తీర్మానించారు. నివేదికను స్వీకరించిన ఆరు రోజుల్లోనే కేబినెట్‌ను ఆహ్వానించిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య గందరగోళంగా మారిన మేరకు ఏకంగా రెండు వారాల తర్వాత మరో భేటీకి ఆహ్వానిస్తున్నారు. ఈలోగా సమగ్ర అవగాహన పొందాలని మంత్రులందరికీ సీఎం సూచించినా కులాల విషయంలో ఏవిధంగా నోరుజారినా మొత్తానికే ఎసరు వస్తుందని ఆచితూచి వ్యవహరిస్తున్నారు. కులగణన వంటి తేనెతుట్టెను కదిపిన ప్రభుత్వ పరిస్థితి ముందు నుయ్యి వెనుకగ గొయ్యి లా మారిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పట్లో కులగణన నివేదిక తేలదనే విమర్శలు కూడా అప్పుడే హల్‌చల్ చేస్తున్నాయి. నివేదిక శాస్త్రీయంగా లేదని పదేళ్ళ కిందట సర్వే కావడంతో మార్పులు ఉంటాయని మరోసారి సమగ్ర సర్వే జరపాలనే డిమాండ్ కూడా వ్యక్తమవుతోంది. తాత్కాలికంగా కులగణన అంశానికి బ్రేక్ పడినట్లే అని పిస్తోంది.

మాజీ ఎంపీ ప్రజ్వల్‌కు హైకోర్టులో షాక్..!

- 'విచారణ వాయిదా' పిటిషన్ తిరస్కరణ



బెంగళూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అత్యాచారం, లైంగిక దాడులకు సంబంధించిన కేసులో పదినెలలుగా జైలులో గడుపుతున్న జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు హైకోర్టులో షాక్ తగిలింది. సాక్షులను విచారించరాదని, నిరంతర విచారణ జరిపేందుకు సెషన్స్ కోర్టు నిర్దేశించిన గడువును వాయిదా వేయాలని, కేసును రద్దు చేయాలని కోరుతూ ప్రజ్వల్ తరుపు న్యాయవాదులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టులోని ఎమ్మెల్యేలు, ఎంపీలపై నమోదైన క్రిమినల్ కేసుల ప్రత్యేక బెంచ్ న్యాయమూర్తి ప్రదీప్‌సింగ్ యెరూరు విచారణ జరిపిన ధర్మాసనం కేసును వాయిదా వేయలేమంటూ ప్రజ్వల్ పిటిషన్‌ను తిరస్కరించింది. ప్రజ్వల్ తరుపున న్యాయవాది అరుణ్‌శ్యామ్ వాదిస్తూ ఈ కేసులో బాధితులు ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదని, ఇదో రాజకీయ ద్వేష పూరితమైన కేసు అన్నారు. సిట్ ఛార్జ్‌షీట్ దాఖలు చేసే అధికారం ఉండదన్నారు. ప్రాసిక్యూటర్ తరుపున న్యాయవాది రవివర్మకుమార్ మాట్లాడుతూ నిందితుడు పనిమనిషితో పాటు మధ్యవయస్సు కలిగిన మహిళలపై లైంగిక దాడులకు పాల్పడిన సాక్ష్యాలు ఉన్నాయన్నారు. నిందితుడి మొబైల్‌లో వీడియోలు ఉన్నాయని, డీఎన్ఏ, ధ్వని పరీక్షల్లోనూ రుజువయ్యిందన్నారు. బాధిత మహిళతో పాటు సిట్‌కు నోటీసులు జారీ చేయాలని సూచించిన ధర్మాసనం ప్రజ్వల్ పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో ప్రజ్వల్ కేసును ఎదుర్కోక తప్పదని నిర్ణయించినట్లు అయ్యింది.

పట్టువదలని అన్నదాత..!

- జొన్న కొనుగోలు చేయాలని బళ్లారిలో రైతుల ఆందోళన
- ఉదయం నుంచి రాత్రి దాకా కలెక్టరేట్ వద్దే..
- సీఎం, మార్కెట్ శాఖ మంత్రితో ఫోన్‌లో ఎమ్మెల్యే నారా సంప్రదింపులు
- స్పష్టమైన హామీతో శాంతించిన రైతులు



డీసీ కార్యాలయం వద్ద బైఠాయించిన రైతులు

బళ్లారి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అన్నదాత పట్టువదల్లేదు..జొన్న కొనుగోలుపై దిగి రావాల్సిందేనని అధికారులకు ముచ్చుమటలు పట్టించారు. తుంగభద్ర ఆయకట్టు, బోర్ల కింద రైతులు పండించిన జొన్న పంటను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోళు చేయాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం, హసిరుసేన నాయకులు డిమాండ్ చేశారు. బళ్లారి జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి మొక్కజొన్న పండించిన రైతులు పెద్ద సంఖ్యలో చేరి గురువారం బళ్లారి డీసీ కార్యాలయం ఆవరణంలో బైఠాయించారు. తుంగభద్ర ఆయకట్టు బాగంలో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్నను పండించారని, ప్రభుత్వం ఏర్పాటు చేసిక కొనుగోలు కేంద్రాల్లో పరిమితం చేయడం సరి కాదన్నారు. మొత్తం పంటను కొనాల్సిందేనని డిమాండ్ చేశారు. అనంతరం డీ.సీ ప్రశాంత్ కుమార్ మిశ్రాకు వినతిపత్రం అందజేశారు.

వినతి పత్రం ఇచ్చి వెళ్లిపోతారు.. అనుకుంటే

ఉదయమే ధర్నా ప్రారంభించిన రైతులు మధ్యాహ్నాం డీసీకి వినతిపత్రం అందజేశారు. కానీ స్పష్టమైన హామీ ఏమీ ఇవ్వకపోవడంతో ధర్నాను కొనసాగించారు. రాత్రి 10 గంటలైనా రైతులు డీసీ కార్యాలయం వద్దే భైఠాయించారు. దీనితో అధికారులు, పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఉదయం నుంచి ధర్నా ప్రారంభించిన రైతులు రాత్రి 10 గంటల వరకూ కొనసాగించారు. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చే వరకూ కదిలేది లేదని పట్టుబట్టి కూర్చున్నారు.

శిబిరం వద్దకు ఎమ్మెల్యే

నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి రాత్రి శిభిరం వద్దకు చేరకుఉని రైతులతో చర్చలు జరిపారు. రైతు సంఘం నాయకులు మాధవరెడ్డి, చాగనూరు మల్లికార్జునరెడ్డిలతో మాట్లాడిన ఆయన న్యాయం చేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. జొన్న కొనుగోళ్లు చేసే విషయంలో స్పష్టత ఇచ్చేంత వరకూ కదలమని రైతులు మొండికేసి కూర్చున్నారు. సీఎం సిద్దరామయ్య, మార్కెట్ యార్డు శాఖ మంత్రి శివనంద పాటిల్, ఇన్‌చార్జి మంత్రి జమీర్ అమ్మద్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. ఇక్కడ పరిస్థితిని వివరించారు. రైతులు పండించిన జొన్న పంటను కొనుగోళ్లు చేయాలని ఆయన వారిని కోరారు. స్పష్టమైన హామీతో రైతులు ధర్నా విరమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే అన్నదాతకు కష్టం రాకుండా కాపాడుకుంటామన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులతో మాట్లాడామని సోమవారం జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్ని జొన్నలుంటే అన్ని కొంటామన్నారు. ఆయన హామీతో రైతులు ఆందోళన విరమించారు.



రైతు సంఘం నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి





అనుమానమే..!

- ఈ ఏడాది అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ అడ్మిషన్లు ప్రారంభించేరా..?
- తీవ్రమైన గ్రాంట్ల కొరత.. మౌలికసదుపాయాల లేమి

బెంగళూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యకంటే ముందుగానే పిల్లలకు బడి వాతావరణం కల్పించడంతోపాటు పౌష్టికాహారం అందిస్తున్న కేంద్రాలుగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహించాలనే ప్రతిపాదనకు రాష్ట్రప్రభుత్వం గత ఏడాది పచ్చజెండా చూపింది. అయితే వచ్చే విద్యాసంవత్సరం నుంచే ఇవి అమలయ్యేది అనుమానమేనని తెలుస్తోంది. స్త్రీ శిశుసంక్షేమశాఖ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 65వేల అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రైవేటుకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలలో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహించడం ద్వారా సామాన్య, మధ్య తరగతి వర్గాలకు మేలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. రాష్ట్రంలోని 65వేల అంగన్‌వాడీ కేంద్రాలకుగాను సుమారు 17వేల కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ నిర్వహించేందుకు మౌలిక సదుపాయాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కో కేంద్రంలో కనీసం 25మంది పిల్లలకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు. యూకేజీలో చేర్చేందుకు కనీస వయస్సు 5-6ఏళ్లుగా నిర్ణయించారు.

- గత ఏడాది జులైలో బెంగళూరు రాజాజీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రయోగాత్మకంగా ఎల్‌కేజీ-యూకేజీలను ప్రారంభించారు. బెంగళూరులో తొలిదశలో 250 కేంద్రాలలో ప్రారంభించదలిచినట్లు అప్పట్లో స్త్రీశిశుసంక్షేమశాఖ ప్రకటించింది. ఇంతవరకు ఎలాంటి గ్రాంట్లు విడుదల చేయలేదు. దీంతో కొత్త ఏడాదిలో ప్రవేశాలు కల్పించడం అనుమానమేనని తెలుస్తోంది. దీనికితోడు అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు నూతన విద్యావిధానం అమలయ్యేది కష్టమేనని అంచనా.

గుణాత్మక విద్యే లక్ష్యం

బాల్యంనుంచే పిల్లలకు గుణాత్మక విద్యను అందించాలనేది ప్రతి తల్లిదండ్రులు భావిస్తారు. గుణాత్మక విద్యను కల్పించాలని విద్యాశాఖ ఆలోచనగా ఉంది. అంగన్‌వాడీ వ్యవస్థలో మార్పులు తెచ్చేలా కేంద్రాలను ఆధునీకరించేందుకు సిద్ధమైంది. దీంతో అంగన్‌వాడీ సంఘాలు ఎంతో పోరాటం చేశాయి. పూర్వ ప్రాథమిక విద్యను అంగన్‌వాడీ కేంద్రాలలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

దశలవారీగా సదుపాయాలు

గత ఏడాది బెంగళూరులో ప్రయోగాత్మకంగా ప్రారంభమైన అంగన్‌వాడీ కేంద్రాలలో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహిస్తున్నామని రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖ డైరెక్టర్ రాఘవేంద్ర అభిప్రాయపడ్డారు. మిగిలిన కేంద్రాలలో నిధులు విడుదలైతే దశలవారీగా విద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు.

తల్లిదండ్రుల్లో నిరాశ

ప్రైవేట్ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీలకు రూ.20వేలనుంచి రూ.లక్ష వరకు ఫీజుగా ఉంది. ఇది భారంగా ఉండడంతో అప్పులు చేసి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారాన్ని తప్పించేలా ప్రభుత్వమే అంగన్‌వాడీ కేంద్రాలలో ఎల్‌కేజీ, యూకేజీలను ప్రారంభించడం ద్వారా లక్షలాదిమందికి అనుకూలం కానుంది. ఇక్కడ పిల్లలకు ఉచిత అడ్మిషన్‌తోపాటు విద్య, ఇతర సౌలభ్యాలు లభించనున్నాయి. ఈ ఏడాది ఎల్‌కేజీ, యూకేజీ తరగతులలో అడ్మిషన్లు అనుమానమే అని వ్యక్తం అవుతుండడంతో తల్లిదండ్రుల్లో నిరాశ నెలకొంది.

రూ.5లక్షల గ్రాంటు

ఎల్‌కేజీ-యూకేజీ తరగతులకు స్మార్ట్ క్లాసులు నిర్వహించేందుకు టీవీ అవసరం. క్రీడామైదానం కావాలి. పిల్లలకు రెండు జతల యూనిఫాం, పుస్తకాలు కూడా ఇవ్వాలి. అన్నింటికంటే ముఖ్యంగా పిల్లలకు విద్యబోధించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలకు ట్రైనింగ్ ఇవ్వాల్సి ఉందని శాఖ ప్రకటించింది. ప్రతి కేంద్రానికి రూ.5లక్షల గ్రాంటు ఇవ్వనున్నట్లు స్త్రీశిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ పథకాన్ని ప్రారంభించినవేళ ప్రకటించారు. అయితే ఇందుకు సంబంధించి ఎటువంటి ప్రస్తావన లేదని, తరగతులకు అవసరమైన సౌలభ్యాలు కల్పించలేదని తెలుస్తోంది.


చీనీ కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

కొనేవారు కరువు..

ఆశాజనకంగా చీనీ దిగుబడులు

పాతాళానికి పడిపోయిన ధరలు


కొనడానికి ముందుకురాని వ్యాపారులు

మొహం చాటేస్తున్న వైనం

అన్నదాతల్లో ఆందోళన

కూడేరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కూడేరు, గార్లదిన్నె, రాప్తాడు, తాడిపత్రి, పామిడి, ఆత్మకూరు, శింగనమల తదితర మండలాల్లో దాదాపు 95 వేల ఎకరాల్లో చీనీ సాగు చేస్తున్నారు. అత్యధికంగా కూడేరు, గార్నదిన్నె మండలాల్లో ఏకంగా 30 వేల ఎకరాల్లో చీనీ సాగు చేస్తున్నారు. జిల్లాలో ఐదారేళ్లుగా చీనీ పంటకు ఆశించిన ధరలు ఉంటుండడంతో వ్యాపారులు తోటల వద్దనే కాయలను కొనుగోలు చేశారు. ఈ ఏడాది చీనీ పంటకు ఎకరాకు లక్షకుపైగా అప్పు చేసి, పెట్టుబడులు పెట్టారు. దిగుబడి ఆశాజనంగా రావడంతో ధర బాగా పలికితే అప్పుల నుంచి బయట పడతామని అన్నదాతలు ఆశించారు. మార్కెట్‌లో ధర పతనం కావడంతో ఊహించని షాక్ తగిలింది. పది టన్నులకు రెండు టన్నుల సూట్‌తో చీనీ టన్ను ధర రూ.25 వేలలోపే పలుకుతోంది. గతేడాది రంజాన్ పండుగ తర్వాత ఏప్రిల్, మే నెలల్లో టన్ను చీనీ రూ.38 వేల నుంచి రూ.45 వేల వరకు ధర పలికింది. దీంతో చీనీ వ్యాపారులు కాయలు కొనడానికి తోటల వద్దకు క్యూ కట్టారు. ఈ ఏడాది రంజాన్ పండుగ దాటినా వ్యాపారులు చీనీతోటల వైపు కన్నెత్తి చూడకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది.

అన్నదాతలు లక్షల రూపాయల అప్పులు చేసి, చీనీ సాగు చేశారు. ఏళ్లపాటు కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. మొదట్లో ధర అంతగా లేదు. ఉగాది, రంజాన్ పండుగల వేళ పెరుగుతుందని అన్నదాతలు ఆశగా ఎదురుచూశారు. పంటను కోయకుండా అలాగే ఉంచారు. పండుగలు వెళ్లిపోయాయి. ధరలు మాత్రం పెరగలేదు. మరింత పడిపోయాయి. టన్ను రూ.25 వేలు కూడా ధర పలకట్లేదు. ఆ ధరకే అమ్ముదామనుకున్నా.. వ్యాపారులు రావట్లేదు. సాధారణంగా తోటల చుట్టూ తిరిగే వ్యాపారులు ఈసారి కనిపించట్లేదు. దీంతో రైతులే.. వ్యాపారుల వద్దకెళ్తున్నారు. కోస్తామని చెప్పిన వ్యాపారులు సైతం తరువాత మొహం చాటేస్తున్నారు. ఫోన్లు చేస్తున్నా.. వ్యాపారులు అందుబాటులోకి రావట్లేదని రైతులు వాపోతున్నారు. పంటను ఎలా అమ్ముకోవాలో దిక్కుతోచక అన్నదాతలు అయోమయంలో పడ్డారు. దీనికితోడు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చీనీ కాయలు రంగు మారుతున్నాయి. ఇది అన్నదాతల్లో మరింత ఆందోళన రేపుతోంది.


విరగ్గాసిన చీనీ

రంగు మారుతున్న కాయలు

బోరు నీటితో సాధారణంగా చీనీ కాయలు రంగు మారడానికి చాలా సమయం పడుతుంది. వర్షపు నీటికి త్వరగా కలర్ మారిపోతాయి. ఈ ఏడాది అకాల వర్షాల ప్రభావం చీనీ కాయలపై కూడా పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు కాయలు కలర్ మారడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. చెట్లపైనే కాయలు కలర్ మారుతుండటంతో ఎక్కువ రోజులు కాయలు పెట్టుకునే పరిస్థితి లేదు. చీనీ కాయలను కొనుగోలు చేసే వ్యాపారులు రాకపోవడంతో తోటల్లో ఎక్కడ చూసినా కాయలు కనిపిస్తున్నాయి.

నాటి వైభవం ఏదీ..?

జిల్లాలోనే కూడేరు, గార్నదిన్నె మండలాలు చీనీ సాగుకు ప్రసిద్ధి. కాయలు కొనుగోలు చేయడానికి వ్యాపారులు ఈ మండలాల్లో తిష్ట వేసేవారు. ఇక్కడే ఇళ్లు అద్దెకు తీసుకుని, ఉండేవారు. ఐదారేళ్ల క్రితం కర్నూలు జిల్లా సిరివెళ్లి ప్రాంతం నుంచి చీనీ వ్యాపారులు అధికంగా వచ్చేవారు. దీంతో వ్యాపారులు గ్రామాల్లో నిత్యం జీపులు, ద్విచక్రవాహనాల్లో తిరుగుతూ కాయల కోసం పోటీ పడేవారు. తోటల చుట్టూ తిరిగేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. వ్యాపారుల చుట్టూ రైతులు తిరిగే దుస్థితి దాపురించింది. రోజురోజుకీ చీనీ ధర పతనం అవుతుండడంతో కాయలు కొన్న వ్యాపారులు సైతం కోయడానికి మొహం చాటేస్తున్నారు. దీంతో అన్నదాతలు కాయలు కొన్న వ్యాపారి కోసం పలుసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదు. గతంలో చీనీకాయల కోసం తోటల వద్దకు వ్యాపారులు క్యూ కడితే... ఈసారి వారి చుట్టూ రైతులు తిరిగే పరిస్థితి ఏర్పడింది.


వర్షానికి రంగుమారిన చీనీ కాయలను చూపుతున్న రైతు ఎద్దుల సుధాకర్

తీవ్రంగా నష్టపోతున్నాం



మూడెకరాల్లో 430 చీనీ చెట్లు సాగు చేశా. రూ.3.5 లక్షల వరకు పెట్టుబడులు పెట్టా. ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో అప్పుల నుంచి గట్టెక్కుతామని ఆనందపడ్డా. ధర పతనం కావడంతో షాక్‌కు లోనయ్యా. కాయలు కోత దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం ధర రూ.25 వేలు కూడా పలకట్లేదు. కొనడానికి వ్యాపారులు కూడా ముందుకు రావట్లేదు. చీనీ సాగు చేసి తీవ్రంగా నష్టపోతున్నాం. మద్దతు ధరతో ప్రభుత్వమే చీనీ కాయలు కొనుగోలు చేయాలి.

- జీడిపల్లి హనుమంతు, చీనీ రైతు, అంతరగంగ, కూడేరు మండలం

దిక్కుతోచని స్థితి..



ఆరెకరాల్లో 900 చీనీ చెట్లు సాగు చేశా. రూ.8 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. దిగుబడి బాగుండటంతో ధర దక్కితే అప్పులు తీరిపోతాయనుకున్నా. ధరలు పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నా. అకాల వర్షాలు ఆందోళన రేపుతున్నాయి. ఈ ఏడాది చీనీ రైతుల కష్టాలు వర్ణనాతీతం.


- కోనంకి జయరాం, చీనీ రైతు, గొటుకూరు, కూడేరు మండలం

ఉజ్వల భవితకు పాలిసెట్

పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. ఉద్యోగాల విషయంలో బీటెక్ వారికంటే పాలిటెక్నిక్ విద్యార్థులకే ప్రాధాన్యం ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేట్ సెక్టార్‌లోను పాలిటెక్నిక్ వారికే పెద్దపీట వేస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఇప్పటికే పాలిసెట్‌కు నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 30న ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా పాలిసెట్ కన్వీనర్ సురేష్‌బాబు తెలియచేశారు. జిల్లాలో పాలిసెట్ పరీక్ష హిందూపురం, ధర్మవరం, కదిరి, పాలిటెక్నిక్ కళాశాలల్లో జరుగనుంది. పాలిసెట్‌కు జిల్లావ్యాప్తంగా దాదాపు 5వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో నాలుగు ప్రభుత్వ, ఒక ప్రైవేట్ కళాశాల ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి, పుట్టపర్తిరూరల్/కొత్తచెరువు

- ఈనెల 30న ప్రవేశ పరీక్ష
- పాలిటెక్నిక్‌తో త్వరగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



పాలిటెక్నిక్‌లో ప్రవేశం ఇలా...

ఇంటర్‌లో ఒకేషనల్ కోర్సు చదివిన విద్యార్థులు, బ్రిడ్జి కోర్సు అర్హత సాధించివారు నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చు. ఐటీఐ ట్రేడ్‌లో 60శాతానికి పైగా మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు బ్రిడ్జి కోర్సు ద్వారా నిర్వహించే అర్హత పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుంది. ఈపరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ద్వితీయ ఏడాది, పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులలో అడ్మిషన్ పొందవచ్చు. ప్రస్తుతం పదోతరగతి రాసిన విద్యార్థులు, ఇదివరకే పదో తరగతి పూర్తి చేసిన వారు పాలిసెట్ రాసి మెరుగైన ర్యాంకులతో కళాశాలల్లో చేరవచ్చు.

చక్కటి ఉపాధి



డిప్లొమా కోర్సులతో చక్కటి ఉపాధి లభిస్తుంది. వివిధ సంస్థలు డిప్లొమా పూర్తి చేసిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. జీవితంలో త్వరగా స్థిరపడటానికి పాలిటెక్నిక్ సరైన మార్గం. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇదో మంచి అవకాశం. డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగం, ఉపాధి పొందవచ్చు.

- సురేష్‌బాబు, శ్రీ సత్యసాయిజిల్లా పాలిసెట్ కన్వీనర్

ఉక్కపోత.. రోగాల మోత

కొత్తచెరువు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వేసవికాలం వచ్చిందంటే చాలు కొంతమందికి అనారోగ్య సమస్యలు తలెత్తుతుంటాయి. ముఖ్యంగా చిన్నారుల్లో ఆటలమ్మ, గవదబిళ్లలు (చికన్‌ఫాక్స్) సోకుతుంటాయి. మండలంలోని చాలా గ్రామాల్లో ఆటలమ్మ, గవదబిళ్లలు కేసులు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. వీటిబారిన పడిన వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా వాపు, నొప్పి తీవ్రంగా బాధిస్తాయి. అన్ని వయసుల వారికి ఈ అంటువ్యాధి వ్యారిసెల్లా అనే వైరస్ వల్ల సోకే అవకాశం ఉంది. చిన్నారుల్లో ఎక్కువగా వస్తుంటుంది. అంటువ్యాధులు సోకకుండా 9 నెలల వయసులోనే చిన్నారులకు టీకా వేస్తామని కొత్తచెరువు సీహెచ్‌సీ వైద్యాధికారి అశ్వర్థకుమార్ తెలిపారు. ముందు జాగ్రత్తలు, అప్రమత్తతతో వ్యవహరిస్తే రక్షణ పొందవచ్చునని సూచిస్తున్నారు.

- చిన్నారులకు ఆటలమ్మ గవదబిళ్లలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



ఆటలమ్మ, గవద బిళ్లల లక్షణాలు

సాధారణంగా వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంటుంది. చిన్నారులు బలవర్ధకమైన ఆహారం తీసుకొనేలా తల్లిదండ్రులు శ్రద్ధచూపాలి. ఆటలమ్మ, గవదబిళ్లలు సోకినవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి మందగించడం, ఆహారం సరిగా తీసుకోలేకపోవడం వల్ల తీవ్రంగా నీరసించిపోతారు. శరీరంపై పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మ, గవదబిళ్లలుగా గుర్తించి వైద్యులను సంప్రదించాలి. వ్యాధి తీవ్రత ఆధారంగా వైద్యుల సలహా మేరకు యాంటీ బయోటిక్, యాంటీ వైరస్ మందులు వాడాల్సి ఉంటుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ఆటలమ్మ, గవదబిళ్లలు సోకినవారిని మిగతా వారికి దూరంగా ఉంచాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు ఇవ్వాలి. గవదబిళ్లలు వచ్చిన వారికి గొంతు నొప్పి తీవ్రంగా ఉంటుంది. తరచూ ద్రవపదార్థాలు తీసుకోవాలి. ఆటలమ్మ, గవదబిళ్లలు వచ్చిన వారి విషయంలో ప్రజలు అపోహలు, మూఢనమ్మకాలతో వైద్యుల సలహా తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మెదడు, ఊపరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.

నిర్లక్ష్యం తగదు



ఆటలమ్మ, గవదబిళ్లల వ్యాధులపై నిర్లక్షం తగదు. చిన్నారులు ఎక్కువగా ఈ వ్యాధుల భారినపడుతుంటారు. వ్యాధి లక్షణాలు కనిపించగానే డాక్టర్‌ను సంప్రదించి వారి సూచన మేరకు మందులు వాడాలి.

- డాక్టర్ అశ్వత్థకుమార్, సీహెచ్‌సీ వైద్యాధికారి, కొత్తచెరువు

ఏపీజీఈఏ సంఘం ఒక్కటే

డూప్లికేట్ నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం

అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ


మాట్లాడుతున్న గోపీకృష్ణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏపీజీఈఏ) ఒక్కటే ఉందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ స్పష్టం చేశారు. సంఘం పేరుతో చలామణి అవుతున్న కొందరు డూప్లికేట్ నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. సంఘం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 15న ఏపీజీఈఓ సంఘమంటూ ఇదివరకే సంఘం నుంచి తొలగించిన శ్రీకాంత్ రాజు, ఆస్కార్‌రావులు, జిల్లా నాయకులుగా పాల్గొన్న రమణకుమార్‌లు తమ సంఘం నేతలపై అవాకులుచవాకులు పేలడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై పోరాటం చేస్తూ జీతాల చెల్లింపులు చట్టబద్ధం చేయాలని తదితర వాటిపై పోరాటం చేసిన నాయకుడు కేఆర్. సూర్యనారాయణ అన్నారు. అలాంటి నేతపై ఆస్కార్‌రావు, శ్రీకాంత్‌రాజు, రమణకుమార్‌లకు విమర్శలు చేసే అర్హత లేదన్నారు. గతంలో ఏపీజీఈఏ సంఘంలో అక్రమాలకు పాల్పడటంతో పాటు సంఘం పేరు, లోగో, లెటర్‌పాడ్స్‌ను దుర్వినియోగపరుస్తూ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఉద్యోగులను మోసం చేసిన చరిత్ర శ్రీకాంత్ రాజు, ఆస్కార్‌రావులదన్నారు. వారిపై విజయవాడ లోని భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నెం. 14/2025 క్రిమినల్ కేసు నమోదైందన్నారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు వేణుగోపాల్, మహిళా అధ్యక్షురాలు సాంబశివమ్మ, నగర అధ్యక్షులు షేక్ రఫి, నాయకులు వినోద్, తిమ్మరాజు, నాగేశ్వరయ్య, నాగరాజు, ఈశ్వరయ్య, శ్రీరాములు, హనుమంతు పాల్గొన్నారు.

1 నుంచి వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు

కొత్తచెరువు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయభాస్కర్ గురువారం ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు, విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, ఫుట్‌బాల్, హాకీ, బాస్కెట్‌బాల్ తదితర క్రీడల్లో శిక్షణ ఇస్తామన్నారు. కోచ్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గల ప్రభుత్వ, ప్రైవేటు పీఈటీలు, పీడీలు, క్రీడా వికాస కేంద్రాల శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు, ఔత్సాహికులు ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని డీఎస్‌డీఓ తెలిపారు. వివరాలకు 9849421462 నంబరులో సంప్రదించాలన్నారు.

దళిత రైతులకు దగా

రీ సర్వేలో భూములు మాయం

దేవదాయ, ప్రభుత్వ భూములుగా మార్పు

20 ఏళ్ల క్రితం పంపిణీ చేసిన టీడీపీ ప్రభుత్వం

తహసీల్దారు కార్యాలయం చుట్టూ బాధితుల ప్రదక్షిణ


దళిత మహిళలకు ఇచ్చిన భూమి

విడపనకల్లు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): దళిత మహిళా రైతులకు వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది. రెండు దశాబ్దాల క్రితం వారికి పంపిణీ చేసిన భూములను వారికి కాకుండా చేసింది. రీసర్వే పేరుతో విడపనకల్లు మండలంలో 200 ఎకరాలకు పైగా భూములను ఆన్‌లైన్‌లో దేవదాయ, ప్రభుత్వ భూములుగా మార్చేసింది. దీంతో బాధిత రైతులకు పంట రుణాలు, ప్రభుత్వ పథకాలూ అందడం లేదు. 2003లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఒక్కో దళిత మహిళకు ఎకరం నుంచి రెండెకరాల వరకూ సాగు భూమిని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసి, పంపిణీ చేసింది. పట్టాదారు పాసుపుస్తకాలు కూడా ఇచ్చింది. భూ కొనుగోలు పథకం కింద మాగాణి అయితే ఎకరం, బయలు పొలం అయితే రెండెకరాల ప్రకారం 360మందికి పంపిణీ చేశారు. ఈ భూములపై పంట రుణాలను కూడా రైతులు తీసుకున్నారు.

వైసీపీ హయాంలో..

రీ సర్వేతో 43, 288ఏ, 46, 219, 52 సర్వే నంబర్లలోని 200 ఎకరాలకుపైగా రైతుల పొలాలను దేవదాయ, ప్రభుత్వ భూములుగా మార్చేశారు. పాత రికార్డుల ప్రకారం భూమి ఏ స్వరూపంలో ఉంటే అలాగే చూపించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. దీంతో దేవదాయ భూమిని లబ్ధిదారుల పేరిట మార్చేందుకు వీలులేకుండా పోయిందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు లేక పోవటంతో బాధిత రైతులు బ్యాంకుల్లో పంట రుణాలను రెన్యూవల్ చేయించుకోలేకపోతున్నారు. ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ఆన్‌లైన్‌లో వన్‌బీ, అడంగల్ వచ్చేలా చూడాలని పట్టాదారు పాసుపుస్తకాలను పట్టుకుని బాధితులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఏ అధికారీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





నా పేరు లేకుండా చేశారు...

సర్వే నంబరు 43లో నాకు ఎకరం మాగాణి భూమిని 20 ఏళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇచ్చింది. అప్పుడే నాకు పాసుపుస్తకం ఇచ్చారు. రీ సర్వేలో దేవాలయ భూమిగా మార్చేశారు. పాసుపుస్తకాల్లో నాపేరు ఉంది. కంప్యూటర్‌లో మాత్రం రావటం లేదు. వన్‌బీ, అడంగల్ ఇవ్వడంలేదు.

- గంగమ్మ, రైతు, కరకముక్కల



రీ సర్వేలో మార్చేశారు..

సర్వే నంబరు 288ఏలో నాకు రెండెకకరాల మెట్ట భూమిని ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో భూ రీసర్వే చేసి, నా పొలాన్ని దేవాలయ భూమిగా ఆన్‌లైన్‌లో మార్చేశారు. దీంతో బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు అందట్లేదు. మా భూమిని తిరిగి ఆన్‌లైన్‌లో చేర్చాలి.

- ఉలిగమ్మ, రైతు, కరకముక్కల

అలసిపోయా..



సర్వే నంబరు 46లో నాకు ఎకరం మాగాణి పొలం ఇచ్చారు. భూ రీసర్వే పేరుతో మా పొలాన్ని దేవాలయ భూమిగా మార్చి మా పొట్ట కొట్టారు. 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. ఏనాడూ ఇలాంటి సమస్య రాలేదు. ప్రస్తుతం అండగల్, వన్‌బీ రాక ఇబ్బందులు పడుతున్నాం.

- ఎల్లమ్మ, రైతు, కరకముక్కల



ఆన్‌లైన్‌లో వచ్చేలా చూడండి..

సర్వే నంబరు 43లో నాకు ఎకరం మాగాణి పొలం ఇచ్చారు. 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. గత ప్రభుత్వంలో రీ సర్వే మా పొలాన్ని ప్రభుత్వ భూమిగా మార్చేశారు. దీంతో ప్రభుత్వ పథకాలు అందట్లేదు. ఏటా వన్‌బీల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళితే మాన్యువల్‌గా ఇస్తున్నారు. వాటిని బ్యాంకు అధికారులు తీసుకోవట్లేదు. ఇది చాలా అన్యాయం.

- తిప్పమ్మ, రైతు, కరకముక్కల




దళిత మహిళలకు ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకం

న్యాయం చేస్తాం..

రీ సర్వేలో జరిగిన పొరపాటును పరిశీలించి, దళిత రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం. రికార్డులను పరిశీలించి, జిల్లా అధికారులతో చర్చించి, ఆన్‌లైన్‌లో వన్‌బీలు అడంగల్ వచ్చేలా చర్యలు చేపడతాం.

- చంద్రశేఖరయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్, విడపనకల్లు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

జ్వాలాముఖి (జయంతి)



ప్రముఖ రచయిత కలం పేరు జ్వాలాముఖితోనే పేరొందిన వీరవెల్లి రాఘవాచార్య. 1938 ఏప్రిల్ 18న మెదక్ జిల్లా ఆకారం గ్రామంలో జన్మించారు. కవి, నాస్తికుడు. భారత్ - చైనా మిత్రమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. తెలుగు సాహిత్య ప్రపంచంలో దిగంబర కవులుగా పేరొందిన ఆరుగురు కవులలో జ్వాలాముఖి ఒకరు. విరసం సభ్యుడిగా కొనసాగారు. బాల్యానికి రక్షణ, యవ్వనానికి క్రమశిక్షణ, వార్ధక్యానికి పరిరక్షణ కల్పించగల వ్యవస్థే సోషలిస్టు సమాజం అని విశదీకరించారు. ఝాన్సీ హేతువాద మెమోరియల్ అవార్డు, దాశరథి రంగాచార్య పురస్కారం ఇతర అవార్డులు అందుకున్నారు. 2008 డిసెంబరు 4న కన్నుమూశారు.

ఏవీఎస్ రాజు (పుట్టినరోజు)



నాగార్జున కన్స్ట్రక్షన్స్ కంపెనీ సంస్థ అధ్యక్షుడు అల్లూరి వెంకట సత్యనారాయణ (ఏవీఎస్) రాజు 1937 ఏప్రిల్ 18న తూర్పుగోదావరి జిల్లా అంతర్వేది పాలెంలో జన్మించారు. వ్యవసాయ కుటుంబం నుంచి పారిశ్రామికవేత్తగా ఎదిగారు. వ్యాపార రంగంలో ఆయన కృషికి పద్మశ్రీ పురస్కారం దక్కింది. హైదరాబాద్ నగరంలో నెక్లెస్ రోడ్డు, ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ లాంటి ప్రతిష్టాత్మక నిర్మాణాలు చేపట్టారు. 2007లో సత్యసాయి బాబాపై రాసిన పుస్తకం అతిపెద్ద జీవిత చరిత్రగా గిన్నిస్‌బుక్‌లో చోటు పొందింది. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ద్వారా జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు.

బెంగ్ట్ రాబర్ట్ హోల్‌స్ట్రామ్ (పుట్టినరోజు)



ప్రపంచ ఆర్థికవేత్తలలో ఒకరైన బెంగ్ట్ రాబర్ట్ హోల్‌స్ట్రామ్ 1949 ఏప్రిల్ 18న ఫిన్లాండ్ దేశం హెల్సింకిలో జన్మించారు. మస్సాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఒలివర్ హార్ట్‌తో కలసి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ స్వీడన్ నుంచి ఎకనామిక్స్ సైన్సెస్‌లో 2016లో నోబెల్ మెమోరియల్ ప్రైజ్ అందుకున్నారు. ఆయనకు గౌరవ డాక్టరేట్‌లు లభించాయి. నోకియా బోర్డ్ డైరెక్టర్‌గా 1999 నుంచి 2012 వరకు కొనసాగారు. ప్రస్తుతం ఆల్టో యూనివర్సిటీలో బోర్డు సభ్యుడిగా కూడా ఉన్నారు.

కేఎల్ రాహుల్ (పుట్టినరోజు)



కణ్ణూరు లోకేశ్ రాహుల్ 1992 ఏప్రిల్ 18న బెంగళూరులో జన్మించారు. కర్ణాటక నుంచి ఇంటర్నేషనల్ క్రికెటర్‌గా ఎదిగారు. ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నారు. మూడు ఫార్మాట్‌లలోనూ సెంచరీ చేసిన ఘనత ఆయనది. ఐపీఎల్ 2020లో అత్యధికంగా పరుగులు చేసినందుకు ఆరెంజ్ క్యాప్ దక్కించుకున్నారు. 2024 జనవరి నాటికి 17 ఇంటర్నేషనల్ సెంచరీలు చేశారు.

పేదల వ్యతిరేకి ప్రధాని మోదీ

● ధరల పెంపుపై కాంగ్రెస్ ఆందోళన ● సీఎం, డీసీఎం, మంత్రుల భాగస్వామ్యం





సిలిండర్ బొమ్మలను చూపుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

బెంగళూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): దేశంలో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యతిరేకంగా ఉన్నారని అందుకే నిత్యావసర ధరలు పెంచేశారని సీఎం సిద్దరామయ్య మండిపడ్డారు. కేంద్రప్రభుత్వం నిత్యావసర ధరల పెంపును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఫ్రీడం పార్కులో ఆందోళన చేశారు. డీసీఎం డీకే శివకుమార్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ రణదీప్‌సింగ్ సూర్జేవాలా సహా మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ డీజిల్, పెట్రోలు, ఆహారపదార్థాలతో పాటు రసాయనిక ఎరువులు, మందులు వంటి అత్యవసర వస్తువుల ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచేసిందన్నారు. రాష్ట్ర బీజేపీ నాయకులు ఏం మొహం పెట్టుకుని జనాక్రోశ పేరుతో యాత్రలు చేస్తున్నారంటూ ప్రశ్నించారు. నాలుగు రూపాయలు లీటరు పాలకు ధరపెంచి నేరుగా పాడి రైతులకు ఇస్తున్నామన్నారు. నేషనల్‌హెరాల్డ్ పత్రిక వివాదంలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఛార్జ్‌షీట్ దాఖలు చేయడం సరికాదన్నారు. రాజకీయం అంటే కేవలం అధికారం మాత్రమే కాదని సిద్ధాంతాల పరంగా ప్రజల తరుపున నిలబడి నిరంతరం చేసే పోరాటమే రాజకీయ బద్ధత అన్నారు. అబద్దాలు బీజేపీకు ఇంటిదేవుడన్నారు. ఆర్ఎస్ఎస్ అంటే అబద్దాల ఫ్యాక్టరీ అన్నారు. రాష్ట్రంలో మా ప్రభుత్వం దివాలా తీసిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తప్పుడు ప్రచారం చేశారన్నారు. దివాలా తీసి ఉంటే ఏడాదికి గ్యారెంటీలకు ఏకంగా రూ.56వేల కోట్లు ఎలా ఖర్చు చేస్తామన్నారు.

● డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర పాలనను ప్రతిపక్షాలు పచ్చకామెర్లు వచ్చిన వారిలానే చూస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ఇంధన, నిత్యావసరాలు, బంగారం, సిమెంట్, ఐరన్ ధరలు పదేళ్ళలో భారీగా పెరిగాయన్నారు. కేంద్రం అన్నివర్గాలపై ధరల భారం మోపుతుంటే రాష్ట్ర బీజేపీ నాయకులు ఉనికిని కాపాడుకునేందుకు జనాక్రోశం పేరుతో యాత్రలు చేస్తున్నారన్నారు. పాలధరలు పెంచారని గగ్గోలు పెడుతున్నారు కానీ కేరళలో రూ.52, గుజరాత్‌లో రూ.53, ఢిల్లీలో రూ.55, తెలంగాణలో రూ.58, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లో రూ.56గా ధరలు ఉన్నాయన్నారు. అంతర్జాతీయంగా ముడి ఇంధనం ధరతగ్గినా పెట్రోలు, డీజిల్‌ధరలు పెరుగుతూనే ఉన్నాయన్నారు. ఇదే సందర్భంలోనే కేంద్రమంత్రి కుమారస్వామిపైనా మండిపడ్డారు. కుమారస్వామి అన్నదమ్ముల ఆస్తుల గురించి ఇంకా మాట్లాడలేదన్నారు. మిస్టర్ కుమారస్వామి నాపై టన్నుల కొద్దీ అవినీతి సాక్ష్యాలు ఉంటే లారీల ద్వారా గవర్నర్‌కు పంపాలనంటూ సవాల్ చేశారు. బీజేపీ గొడ్డు బెదరింపులకు భయపడేవారు లేరన్నారు. ఆందోళనలో ఏఐసీసీ కార్యదర్శి అభిషేక్‌దత్, మయూర్ జైకుమార్, మంత్రులు రామలింగారెడ్డి, కృష్ణబైరేగౌడ, కేహెచ్ మునియప్ప, కేజె జార్జ్, మహదేవప్ప, చలువరాయస్వామి, ఎంబీ పాటిల్, ఈశ్వర్‌ఖండ్రే, లక్ష్మీహెబ్బాళ్కర్, బోసరాజు, ఎంసీ సుధాకర్, భైరతీ సురేష్‌తో పాటు యూత్‌కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు వివిధ జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.



ఆందోళనతో ఆగిపోయిన వాహనాలు



ఆటోడ్రైవర్‌కు ధరల పెంపు కరపత్రం ఇస్తున్న ఆప్ నాయకులు, కార్యకర్తలు

దొందూ దొందే..!

● ధరల పెంపునకు బీజేపీ, కాంగ్రెసే కారణం: ఆప్ నిరసన

బెంగళూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ప్రభుత్వం సాగిస్తున్న బీజేపీ, రాష్ట్రంలో ప్రభుత్వం నడుపుతున్న కాంగ్రెస్‌లు పేద మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారాన్ని నింపాయని ఆప్ నాయకులు మండిపడ్డారు. గురువారం చర్చ్‌స్ట్రీట్‌లో నిరసన చేపట్టారు. రెండుపార్టీలు తుఘలక్ పాలనలు సాగిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో స్టాంప్‌డ్యూటీ 300శాతంకు పెంచారన్నారు. ఆస్తులపై పన్నులు పెంచారని, వాహనాల రిజిస్ట్రేషన్ పెరిగిందని పాలు, మద్యం, పెట్రోలు డీజిల్ ధరలు పెంచారన్నారు. పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలో ఫీజులు పెరిగాయన్నారు. కేంద్రప్రభుత్వం నిత్యావసరాలతో పాటు అన్ని ధరలను నిరంతరంగా పెంచుతూనే ఉన్నారన్నారు. గ్యాస్ సిలెండర్ ధర ఏటా మారిపోతోందన్నారు. ఆటోడ్రైవర్‌లు, వీధి వ్యాపారులకు కరపత్రాలు పంచి నిరసన కొనసాగించారు.

ఘర్షణ కేసులో 27 ఏళ్ల తర్వాత నిందితుడి అరెస్టు

బెంగళూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పాతికేళ్ల అనంతరం ఓ గొడవ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసిన సంఘటన కోలారు జిల్లాలో చోటు చేసుకుంది. 1998లో చోటు చేసుకున్న గొడవ కేసుకు సంబంధించి జిల్లా కేంద్రమైన కోలారులోని గల్‌పేట పోలీసులు నిందితుడిని గురువారం అరెస్టు చేశారు. కోటె లేఅవుట్‌కు చెందిన ప్యారేజాన్ అరెస్టు అయిన వ్యక్తి. ఇతడిపై దాడి, బెదరింపు తదితర వాటికి సంబంధించిన సెక్షన్‌లపై కేసు నమోదైంది. ఎట్టకేలకు నిందితుడిని అరెస్టు చేసిన కానిస్టేబుల్ మంజునాథ్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

అప్పు తీర్చలేక హైడ్రామా..!

● గ్యాంగ్ రేప్ చేశారంటూ ఫిర్యాదు ● విచారణలో నిజాలు తేల్చిన పోలీసులు

బెంగళూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఐదుగురు వ్యక్తులు గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డారంటూ ఆరోపిస్తూ హావేరి నగరంలోని ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో పోలీసులు షాక్‌కు గురయ్యారు. ఇటీవలే ఐదేళ్ళ బాలిక హత్యాచారం సంఘటనతో అప్రమత్తమైన పోలీసులు ఆ మహిళను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించే ప్రయత్నం చేశారు. మరో వైపు ఆమె ఆరోపణలకు అనుగుణంగా సంబంధిత వ్యక్తులను గుర్తించి అరెస్టు చేసేందుకు ప్రత్యేకంగా పోలీసు బృందాలను గురువారం ఏర్పాటు చేశారు. అయితే ఆమెకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఎటువంటి గ్యాంగ్‌రేప్ జరుగలేదని తేల్చారు. దీంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు సదరు మహిళను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అప్పు చెల్లించాల్సి ఉండేదని దీంతో ఇద్దరు మహిళలతో పాటు మరికొంత మంది పురుషులు వచ్చి దాడికి పాల్పడ్డారని తేల్చారు.



ర్యాలీ చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

హిందువులను ఎందుకు అవమానిస్తున్నారు..?

ముడా అవినీతిలో మునిగిన సీఎం - ఈ ఏడాది ప్రభుత్వం కూలడం ఖాయం - బాగల్కోటెలో మాజీ సీఎం జగదీశ్ శెట్టర్

బెంగళూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హిందువులను ఎందుకు అవమానిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర సూటిగా ప్రశ్నించారు. గురువారం బాగల్కోటె జనాక్రోశయాత్రలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థానంలో పేదలు, దళితులు, రైతుల కన్నీళ్లను తుడిచారా అంటూ సిద్దరామయ్యను ప్రశ్నించారు. మీరు ముఖ్యమంత్రి అయ్యాక రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, హిందు యువతులపై దాడులు, లవ్ జిహాద్ అధికమయ్యాన్నారు. గోవధకు అడ్డుకట్ట వేయలేదన్నారు. వీటికి రానున్న రోజుల్లో ప్రజలనుంచి తగిన జవాబు తప్పదన్నారు. గతంలో యడియూరప్ప బీజేపీ పాలనలో రైతులు తమ పొలాలకు ట్రాన్స్‌ఫార్మర్లకు రూ.25వేలు డిపాజిట్‌గా ఉండేదన్నారు. రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్న సిద్దరామయ్య ప్రభుత్వంలో రూ.2.50లక్షల నుంచి రూ.3లక్షలదాకా చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ కాంట్రాక్టులలో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ ఏ ప్రాతిపదికన ఇస్తారని ప్రశ్నించారు. ముస్లిం యువతుల పెళ్లిళ్లకు రూ.50వేలు ఇస్తారని, హిందువులలో పేదలు కనబడ్డం లేదా అంటూ ప్రశ్నించారు. ముస్లిం యువత విదేశాలలో ఉన్నత విద్యకు రూ.30లక్షలు ఇస్తారని, హిందువుల యువతకు అంత ప్రాధాన్యం ఎక్కడ అని ప్రశ్నించారు. ఈ తారతమ్యాన్ని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ చేపట్టిన జనాక్రోశ యాత్రకు ప్రజలనుంచి స్పందన వస్తోంది. బాగల్కోటెలో గురువారం చేపట్టిన ర్యాలీలో మాజీ సీఎం, ఎంపీ జగదీశ్ శెట్టర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ముడా' అవినీతి వివాదంలో సీఎం సిద్దరామయ్య కూరుకుపోయారని, మరో వైపు డీసీఎం డీకే శివకుమార్ ఇచ్చే టైంబాంబ్ బద్ధలై నవంబరు లేదా డిసెంబరులో ప్రభుత్వం కూలడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పాలనలో అవినీతికి హద్దులు లేవన్నారు. నిత్యావసర ధరలను నియంత్రించడంలో విఫలం కావడమే కాక ధరలను పెంచి ప్రజల ఆగ్రహానికి గురయ్యారన్నారు. పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి మాట్లాడుతూ సీఎం సిద్దరామయ్యను ఇంటికి పంపడం ఖాయమన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందన్న ధీమాను వ్యక్తం చేశారు. ఒక్కొక్కరిని ప్రభుత్వం దెబ్బతీస్తోందన్నారు. ఒక్కలిగ, లింగాయతలను అణిచివేసే కుట్ర సాగుతోందన్నారు. 40శాతం కమీషన్ అంటూ ఆరోపణలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయన్నారు.

మాజీ డీసీఎం, ప్రస్తుత ఎంపీ గోవింద కారజోళ మాట్లాడుతూ గ్యారంటీల పేరిట అభివృద్ధిని విస్మరించారన్నారు. ఎటుచూసినా అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ధరలు పెంచడం ద్వారా ప్రజలపై భారం మోపారన్నారు. బాగల్కోటె, విజాపుర, ఉత్తర కర్ణాటక ప్రజలకు మహామోసం చేసిన సిద్దరామయ్యకు త్వరలోనే గుణపాఠం తప్పదన్నారు. మరో ఎంపీ పీసీ గద్దిగౌడర్ మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. అవినీతి పెరిగిందన్నారు. నైతికత లేని సిద్దరామయ్య తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి శ్రీరాములు మాట్లాడుతూ కులగణనపై చర్చ జరుగుతోందన్నారు. అన్నింటా అవినీతి తాండవిస్తోందని, కమీషన్ ప్రమాణంపైనే ధ్యాసగా ఉందన్నారు. ఉదయమైతే డబ్బు, రాత్రి అయితే హనీ ట్రాప్ అంశాలే హాట్‌టాపిక్‌గా ఉన్నాయన్నారు. ఎమ్మెల్యేలు తమ గ్రాంట్లకోసం అడుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. నియోజకవర్గ గ్రాంట్లు కోరితే సీఎం 'రేపు రా...' అంటున్నారన్నారు. కులగణన నివేదికతో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరగనుందన్నారు. 2028లో బీజేపీ అధికారంలోకి రావడంఖాయమన్నారు. జనాక్రోశ ర్యాలీలో పరిషత్ చీఫ్ విప్ ఎన్ రవికుమార్, ఎమ్మెల్సీ హనుమంత నిరాణి, పీహెచ్ పూజార, ఎమ్మెల్యే జగదీశ్ గుడగంటి, మాజీ ఎమ్మెల్యే వీరణ్ణ చరంతిమఠ పాల్గొన్నారు.



ఎడ్ల బండ్లపై వస్తున్న రైతులు

జాగ్రత్తలే రక్ష

● వర్షాకాలంలో పిడుగులతో అప్రమత్తంగా ఉందాం

కొత్తచెరువు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో ఇటీవల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన భారీ వర్షాలు అక్కడక్కడ కురుస్తున్నాయి. ఈక్రమంలో పశువులు, గొర్రెలు, మేకలు, మనుషులు సైతం మృత్యువాత పడుతున్నారు. రెండు రోజుల కిందట అనంతపురం జిల్లాలోని పెనకచెర్లలో పిడుగుపాటుకు గొర్రెలు మృతిచెందాయి. పిడుగు పడే సమయంలో పిడుగు పడే ప్రాంతాలపై విపత్తుసంస్థ ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్‌కు సమాచారం అందిస్తూ అప్రమత్తం చేస్తోంది. అయినా ఏదో ఒక చోట పిడుగు పాటుతో ప్రాణ నష్టం జరుగుతూనే ఉంది. అయితే కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే పిడుగు పాటు నుంచి సురక్షితంగా బయటపడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు ఇలా..

● సాధారణంగా ఎత్తుగా ఉండే చెట్లు, భవనాలు, నిర్మాణాలపై పిడుగులు ఎక్కువగా పడుతుంటాయి. వర్షం కురుస్తున్నప్పుడు ఎట్టిపరిస్థితులోనూ ఎత్తైన చెట్లు, సెల్‌ఫోన్‌టవర్లు, విద్యుత్ స్తంభాలు, కొండల వద్దకు వెళ్లరాదు. విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలి.

● సెల్‌ఫోన్‌లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, గేమ్‌సిస్టమ్‌లు, వాషింగ్ మేషీన్లు, కరెంటు స్టౌలు ఇతర విద్యుత్ పరికరాలు ఉపయోగించరాదు.

● వర్షం కురిసినప్పుడు వాడితే కరెంటు హెచ్చుతగ్గులతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

● పొలాల్లో పనిచేయడం, పశువులను మేపడం, చేపలు పట్టడం, చెరువులలో ఉండటం, నదులు, సముద్రం, ఈత కొలనులు వంటి ప్రదేశాలకు దూరంగా ఉండాలి. గుంపుగా ఉండరాదు. ఒకరికొకరు దూరంగా ఉండాలి.

● ఉరుములతో కూడిన వర్షం వచ్చినప్పుడు నీటితో పనులు చేయరాదు. పిడుగు పడిన సందర్భాల్లో ముఖ్యంగా శరీరంపై కాలిన గాయాలు కావడం, గుండెపోటు రావడం, పిడుగుల శబ్దానికి చెవులు వినకపోవడం వంటివి జరుగుతాయి.

● ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్నపుడు మెడవెనుక జుట్టు నిక్కపొడిచినా, చర్మం జలదరింపునకు గురైన, మెరుపు వచ్చినా పిడుగు రావడానికి సూచనగా భావించాలి. ఇంట్లో ఉన్నట్లయితే కిటికీలు, తలుపులు మూసివేయాలి. ఉరుములు శబ్దం ఆగిన తరువాత 30 నిమిషాల వరకు ఇంటిలో ఉండాలి. కారు ఇతర వాహనాల్లో ఉంటే అన్ని డోర్‌లు మూసివేయాలి. పిడుగుల సమయంలో ఉరుములు, మెరుపులు పడే సమయంలో వర్షం వస్తే స్నానం చేయడం, చేతులు కడగడం, నీటిలో ఉండటం లాంటివి చేయరాదు. మోటారు సైకిళ్ల, ట్రాక్టర్‌లు, వ్యవసాయ పనిముట్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు వేలాడుతున్న విద్యుత్ తీగలకు ఇతర ఇనుప వస్తువులకు దూరంగా ఉండాలి.

మ్యాటర్ ఎరా ఎలక్ట్రిక్ గేర్

మోటార్ బైక్ విడుదల



వాహనాలు విడుదల చేస్తున్న సీఈఓ మోహన్ లాల్

బెంగళూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ వాహనాలకు ఏటా ఆదరణ పెరుగుతోంది. అందుకు అనుగుణంగానే వివిధ కంపెనీలు పలు మోడళ్ళలో వాహనాలను మార్కెట్‌లోకి తెస్తున్నాయి. బెంగళూరు మార్కెట్‌లోకి ఎలక్ట్రికల్ మోటార్ బైక్‌ను మ్యాటర్ ఎరా కంపెనీ లాంఛనంగా విడుదల చేసింది. గురువారం నగరంలో వివిధ రంగులతో పాటు మోడళ్ళ బైక్‌లను మ్యాటర్ ఎరా కంపెనీ ఎండీ సీఈఓ మోహన్‌లాల్ భాయ్ బైక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ బైక్‌లను విడుదల చేస్తున్నామన్నారు. బెంగళూరులో తొలి 500 మంది వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్‌గా ఎనిమిది వేలు తగ్గిస్తున్నామని, రూ.15వేల విలువైన లైఫ్‌టైం బ్యాటరీని ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే బీటీఎంలో ఎక్స్‌పీరియన్స్ హబ్‌ను తెరుస్తామన్నారు. టెస్ట్‌రైడ్‌లకు అవకాశం ఉంటుందన్నారు. ఒకసారి ఛార్జ్ చేసుకుంటే 172 కిలోమీటర్‌లు ప్రయాణించవచ్చున్నారు. దేశ ప్రజలకు అనుగుణంగా వాహనాన్ని తీర్చామన్నారు. హైపర్‌షిఫ్ట్ మాన్యువల్ గేర్‌బాక్స్ అమర్చామన్నారు. రిమోట్ లాక్‌తో పాటు పలు సాంకేతికతలను అనుసంధానం చేశామన్నారు.

మంత్రి కారు ప్రమాదం కేసులో లారీ డ్రైవర్ అరెస్టు

బెంగళూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): బెళగావి జిల్లా కిత్తూరు తాలూకా అంబడగట్టి గ్రామ సమీపాన స్త్రీశిసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ కారు ప్రమాదం కేసులో లారీ డ్రైవర్‌ను బుధవారం అరెస్టు చేశారు. నిందితుడిని మహారాష్ట్ర రాష్ట్రం పూనె జిల్లా ఇందాపుర తాలూకా తక్రారవాడి గ్రామానికి చెందిన మధుకర కొండిరామ సోమవంశం (65)గా గుర్తించారు. జనవరి 14న అంబడగట్టి గ్రామం వద్ద మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ కారును ఢీ కొని పరారైన ఘటనలో లారీ డ్రైవర్‌ను ఎట్టకేలకు అరెస్టు చేశారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

వ్యవసాయానికి వెలుగులు

● రైతులకు తీరనున్న కరెంటు కష్టాలు ● కొత్తగా నాలుగు సబ్‌స్టేషన్ల నిర్మాణం ● నేడు ప్రారంభోత్సవం ● మరో మూడింటి నిర్మాణానికి భూమిపూజ ● అన్నదాతల ఆనందం

మడకశిర రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నీటి వనరులే తక్కువ. భూగర్భ జలమట్టాలు దారుణంగా ఉంటాయి. బోరుబావుల కింద తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తుంటారు. విద్యుత్ సరఫరాలో సమస్యలతో ఆ పంటలు కూడా రైతులకు చేతికందట్లేదు. దీంతో విద్యుత్ సరఫరాలో నీరు అందక, పంటలు ఎండిపోయి దిగుబడులు రాక అన్నదాతలు నష్టపోతున్నారు. ఈ సమస్యలను గుర్తించిన కొత్త ప్రభుత్వం వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. నియోజకవర్గంలో ఒక్కసారిగా నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టింది. త్వరితగతిన పూర్తి చేసింది. మరో మూడు సబ్ స్టేషన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. మడకశిర మండలంలోని వైబీ హళ్ళి, కదిరేపల్లి, అమరాపురం మండలంలోని పి. శివరం, అగళి మండలంలోని ఇనగలూరులో నూతన సబ్‌స్టేషన్లు నిర్మించారు. వాటిని శుక్రవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించనున్నారు. మడకశిర మండలం గుండుమల, గుడిబండ మండలం కేకే పాళ్యం, రొళ్ళ మండలంలోని రంగనపల్లి గ్రామాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు.

రైతు కళ్లలో ఆనందం

వ్యవసాయానికి విద్యుత్ సమస్యలు లేకుండా సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవం, కొత్తవాటి నిర్మాణానికి భూమిపూజ చేస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైబీ హళ్ళి సబ్ స్టేషన్ పరిధిలో వైబీ హళ్ళిబుడ్డేపాళ్యం, కోనప్పపాళ్యం, జక్కలపల్లి, కరేసంకనహళ్ళి, భక్తరహళ్ళి, ఉపార్లపల్లి, దొడ్డేపల్లి గ్రామాలున్నాయి. కదిరేపల్లి సబ్ స్టేషన్ పరిధిలో గుర్రపుకొండ, పాపసానిపల్లి, కంబాలపల్లి ముదిగుబ్బ, ఉగ్రేపల్లి, కేకేపాళ్యం, కోడిగానిల్లి, మొళవాయి. బేగార్లపల్లి ఉన్నాయి. ఆయా గ్రామాల్లో విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యలతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందలు పడుతుండేవారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.. రైతుల బాధలు తప్పించేందుకు మండలంలో సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు శరవేగంగా పూర్తిచేశారు. శుక్రవారం వాటిని ప్రారంభించనుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కదిరేపల్లి సబ్‌స్టేషన్

దిగుబడులు వచ్చేవి కావు

అప్పులు చేసి సాగుచేసిన పంటలు.. విద్యుత్ కోతల వల్ల సకాలంలో నీరు అందక ఎండుతుండేవి. సరిగా దిగుబడులు వచ్చేవి కాదు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయేవారు. సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో వోల్టేజీ సమస్య తీరనుంది. పంటలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తప్పనున్నాయి.

-ప్రసాద్, రైతు, బుడ్డేపాళ్యం గ్రామం

రూ.16 కోట్లతో నిర్మాణం

వైబీహళ్ళి, కదిరేపల్లి, పి శివరం, ఇనగలూరులో మొత్తం రూ.16 కోట్ల వ్యయంతో సబ్‌స్టేషన్లు నిర్మించాం. దీంతో వ్యవసాయానికి విద్యుత్ సమస్యలు తలెత్తవు.

- విశ్వనాథ్, విద్యుత్ ఏఈ, మడకశిర

20న క్రికెట్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా సీనియర్, అండర్-23 పురుష క్రికెటర్ల ఎంపిక పోటీలు ఈనెల 20న ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు. 2002 సెప్టెంబరు 1 తరువాత జన్మించిన క్రీడాకారులు అండర్-23 కేటగిరీకి అర్హులన్నారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, పదోతరగతి మార్కుల జాబితా, జనన ధ్రువీకరణ పత్రం తేవాలన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.55	1,578.78
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	411	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	325	162
నీటి నిల్వ (టీఎంసీలు)	7.04	3.91

దరఖాస్తుల ఆహ్వానం



బళ్లారి సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్యానెల్ న్యాయవాదుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బళ్లారి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయంలో మూడు సంవత్సరాల కాలానికి ప్యానెల్ లాయర్లను నియమించనున్నామన్నారు. బళ్లారి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయంలో 01-07-2022 నుంచి 30-06-2025 వరకు ప్యానెల్ అడ్వకేట్లను నియమించారు. ఈ పోస్టుల పదవీ కాలం 30-06-2025న ముగుస్తుందన్నారు. రాబోయే మూడు సంవత్సరాలకు (01-07-2025 నుండి 30-06-2028 వరకు) ప్యానెల్ అడ్వకేట్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నామన్నారు. దరఖాస్తులు సమర్పించడానికి చివరితేదీ మే 03. ఇంటర్వ్యూ తేదీని రాబోయే రోజుల్లో ప్రకటిస్తామన్నారు. వివరాలకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయం లేదా 08392-278077 ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

ఉపాధి కూలీలకు తాగునీరు కరువు



ముద్దటనూరులో నీటి కోసం చూస్తున్న కూలీలు

సిరుగుప్ప, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. సిరుగుప్ప తాలుకాలోని ముద్దటనూరు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండిపోతున్న ఎండలతో సతమతమవుతున్నారు. సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. తక్షణమే తాలుకా పంచాయతీ అధికారులు ఈ విషయంపై దృష్టిసారించి తాగునీటి సౌకర్యం కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును
వ్యతిరేకిస్తూ రేపు ఆందోళన



మహానగర పాలికె ఉపాధ్యక్షుడు సాజీద్

రాయచూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఈ నెల 19న ఆందోళన నిర్వహిస్తున్నట్లు మహానగర పాలిక ఉపాధ్యక్షుడు సాజీద్ సమీర్ తెలిపారు. గురువారం నగరంలో విలేకరులతో మాట్లాడిన ఆయన ఆల్ ముస్లిం పర్సనల్ లా బోర్డ్, వక్ఫ్ బోర్డు కమిటీల ఆధ్వర్యంలో తలపెట్టిన ఈ ఆందోళనలో లౌకికవాద శక్తులన్నీ అండగా నిలవాలన్నారు. 2 గంటల పాటు జిల్లాలో వ్యాపార లావాదేవీలు నిలిపివేసి ఆందోళనకు మద్దతుగా నిలవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ వల్ల ధార్మిక విలువలకు తిలోదకాలిచ్చినట్లు ఉందన్నారు. అదే సమయంలో కేంద్ర తీసుకున్న నిర్ణయం వల్ల దేశంలో మతపరమైన ఉద్రిక్తతలు పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రత్యేక సంఘం తప్పనిసరి

- డైరెక్టర్ పదవులు కేటాయించకపోతే పాల సరఫరా నిలిపివేత
- విజయనగరం పాడి రైతుల ఆందోళన



కలెక్టరేట్ వద్ద నిరసనలో పాడి రైతులు

బళ్లారి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):: రాయచూర్, కొప్పళ, విజయనగరం(రబకోవి) జిల్లాలతో కూడిన పాల యూనియన్‌లో విజయనగరం అత్యధికంగా పాలు ఉత్పత్తి చేసే జిల్లా అని, మెగా డెయిరీలో మరిన్ని డైరెక్టర్ పదవులు ఇవ్వకపోతే బళ్లారికి పాలు పంపలేమని పాల ఉత్పత్తిదారులు నిరసన చేపట్టారు. విజయనగరం జిల్లాకు ప్రత్యేక పాల సంఘం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. వారు బళ్లారికి పాద యాత్రను కూడా నిర్వహించాలని కూడా నిర్ణయించారు. ఈసందర్భంగా ఆల్ కర్ణాటక స్టేట్ కిసాన్ జాగృతి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బసవరాజ్ కుక్కప్పి మాట్లాడుతూ బళ్లారిలో పాల సంఘాలు పెరగలేదని, పాల ఉత్పత్తిని పెంచడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. పాల ఉత్పత్తిదారులు జిల్లా నుంచి ఒక చుక్క పాలు కూడా బళ్లారికి వెళ్లకూడదని నిర్ణయించుకుంటే బళ్లారిలో ఎటువంటి ఆటలు సాగవన్నారు. రాబోయే రోజుల్లో ఈ నిర్ణయం మరింత బలోపేతం అవుతుందన్నారు. రైతు సంఘం నాయకుడు వీరసంగయ్య మాట్లాడుతూ కేఎంఎఫ్ అధ్యక్షుడిగా భీమానాయక్ అద్భుతంగా పని చేశారన్నారు. బళ్లారిలో పరిణామాలు వారికి అవమానకరంగా ఉన్నాయి. బళ్లారిలో అడుగు పెడితే శిక్షిస్తామని బెదిరించారన్నారు. అందుకే బళ్లారికి భారీ పాదయాత్ర నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.
హొసపేటలో రూ.40కోట్ల వ్యయంతో పశుగ్రాస ఉత్పత్తి యూనిట్ నిర్మిస్తున్నామని, కొన్ని రోజుల్లో దీనిని ప్రారంభిస్తామని మిల్క్ ఫెడరేషన్ మరుల సిద్దప్ప తెలిపారు. కంప్లికి చెందిన గంగాధర్ మాట్లాడుతూ బళ్లారి మిల్క్ యూనియన్ అసోసియేషన్ వద్దని, 60కి.మీ దూరంలో ఉన్న బళ్లారికి బదులుగా 25కి.మీ దూరంలో ఉన్న హొసపేటకు పాలు సరఫరా చేస్తామన్నారు. హొసపేటలో మెగా డెయిరీ నిర్మించాలన్నారు. అనంతరం జిల్లాకలెక్టర్ కార్యాలయం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. వందలాది మంది గుమిగూడి ప్రత్యేక పాల సంఘం,మెగా డైరీ కోసం నినాదాలు చేశారు. జిల్లా కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రికి వినతి పత్రం పంపారు.

23న నగరానికి జనాక్రోశ యాత్ర



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ నలీన్

రాయచూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అభివృద్ధి నిరోధక విధానాలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన జనాక్రోశ యాత్ర ఈ నెల 23న రాయచూరుకు రానున్నట్లు యాత్ర ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కేఎస్ నలీన్ తెలిపారు. గురువారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన యాత్ర సన్నాహక సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి లేకపోగా ఇచ్చిన గ్యారెంటీలను సైతం అమలు చేయలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. ఈ విషయాలను ప్రజలకు వివరించడమే లక్ష్యంగా చేపట్టిన రెండవ దశ ఆక్రోశ యాత్ర రాష్ట్రంలోని అన్ని జిల్లాలో సాగుతున్నట్లు తెలిపారు. యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. జిల్లాలో ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు యాత్ర రాకను పురస్కరించుకుని స్థానిక చంద్రమౌళేశ్వర సర్కిల్ నుంచి పాత జిల్లాధికారి కార్యాలయం వరకు పాదయాత్ర ఉంటుందన్నారు. అనంతరం వీరశైవ కల్యాణ మండపం సమీపంలో బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్యక్రమాలకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్రతో పాటు నాయకులు ఆర్.అశోక్, శ్రీరాములు, చలువ నారాయణ స్వామి, గోవింద కారజోళ తదితరులు హాజరవుతారన్నారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు, విద్యావంతులు, మేధావులు యాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తమకున్న అసహనాన్ని ఆక్రోశాన్ని ప్రభుత్వానికి తెలిపేలా ప్రజలు తరలి రావాలన్నారు.

నెరవేరిన అనంత ప్రజల ఏళ్ల కల

- పుట్టపర్తి-బెంగళూరు రైలు... అనంత వరకూ పొడిగింపు

అనంతపురం, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి, బెంగళూరు మధ్య నడుస్తున్న మెము రైలును అనంతపురం వరకూ పొడిగిస్తూ రైల్వే బోర్డు ఈనెల 15వ తేదీన ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. గత పార్లమెంటు సమావేశాల్లో రైలు పొడిగింపు అంశంపై అనేకసార్లు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్), దక్షిణ పశ్చిమ రైల్వే (ఎస్‌డబ్ల్యూఆర్) జనరల్ మేనేజర్లను కలిసి పుట్టపర్తి-బెంగళూరు రైలును అనంతపురం వరకూ పొడిగించాలని కోరానన్నారు. కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్నను వ్యక్తిగతంగా కలిసి విన్నవించానన్నారు. వారి సహకారంతో రెండు రైల్వే జోన్లను ఒప్పించి, అనంతపురం వరకూ పొడిగించారన్నారు. దీంతో అనంతపురం ప్రజల ఏళ్ల కల నెరవేరిందన్నారు. దీంతో బెంగళూరు వెళ్లే ప్రయాణికులు ఈరైలు అనుకూలంగా ఉంటుందన్నారు. ఇది సామాన్య ప్రయాణికులతోపాటు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపార వర్గాలకు ఎంతో ఉపశమనం కలిగించే అంశమన్నారు. ఇప్పటి వరకూ ఉన్న స్టాపేజ్‌తో పాటు విధురాశ్వత్థం, కొత్తచెరువు, బాసంపల్లి, చిగిచెర్ల, జంగాలపల్లె, ప్రసన్నాయపల్లి స్టేషన్లలో కూడా ఈ రైలు ఆపుతారన్నారు. ఈ రైలు అనంతపురం స్టేషన్ నుంచి మధ్యాహ్నం 12.10 గంటలకు బయలుదేరి సాయంత్రం 7 గంటలకు బెంగళూరు స్టేషన్‌కు చేరుకుంటుందని ఆయన వివరించారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

ధర్మవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు బాలకృష్ణ(43) గురువారం రాత్రి ఉరివేసుకున్నాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు బాలకృష్ణ మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. బాలకృష్ణకు భార్య ప్రమీల, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

బసవేశ్వర జయంతికి ఏర్పాట్లు చేయాలి

- ఏడీసీ శివానంద

రాయచూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 30న నిర్వహించే క్రాంతియోగి బసవేశ్వర జయంతి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అడిషనల్ జిల్లాధికారి శివానంద సూచించారు. బసవేశ్వర జయంతి నిర్వహణకు సంబంధించి గురువారం జిల్లాధికారి కార్యాలయంలో పూర్వసిద్ధత సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఏడీసీ ప్రతి ఏటా నిర్వహించే కార్యక్రమాలను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసుకోవాలని ఈ విషయంలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. సమాచారం అన్ని వర్గాల వారికి చేరవేసి అధికారికంగా నిర్వహించే కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు అయ్యేలా చూడాలన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): 2025-26 క్రికెట్ సీజన్ కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రికెటర్లు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు. అండర్-12, 14, 16, 19, 23, సీనియర్ బాల, బాలికల కేటగిరీలలో ఉన్న క్రీడాకారులు ఈనెల 20 నుంచి మే 20లోపు అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ (ఆర్డీటీ స్టేడియం)లోని జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చన్నారు. ఒరిజినల్ ఫారం-5 (జనన ధ్రువీకరణ పత్రం), ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, తాజా పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, తల్లిదండ్రులు ఆధార్ కార్డులతో రిజిస్టర్ చేసుకోవాలన్నారు.



కొత్త చాంబర్‌ను ఏర్పాటు చేసిన అధికారులు

యూజీడీ చాంబర్‌కు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 17: "ప్రమాదకరంగా మారిన యూజీడీ చాంబర్లు" పేరుతో ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. నగరంలో యూజీడీ పనుల నిర్వహణలో నాణ్యత లోపించి ప్రమాదకరంగా మారాయని ఆంధ్రజ్యోతి ప్రచురించింది. దీనిపై స్పందించిన కార్పొరేషన్ అధికారులు గురువారం శిథిలావస్థకు చేరుకున్న చాంబర్ స్థానంలో కాంక్రీటు మూత ఏర్పాటు చేశారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికులను తొలగించడం సరికాదు

- సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు సత్యబాబు

బళ్లారి సిటీ,ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కార్మిక రక్షణలను విస్మరించి, వారిని అర్థాంతరంగా విధుల్లోంచి తొలగించడం సరికాదని సీఐటీయూ నాయకుడు సత్యబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ రాయచూర్, బళ్లారి,కొప్పళ,వియనగరం జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య(కేఎంఎఫ్) అనేక కారణాల వల్ల నష్టాల్లో నడుస్తోందన్నారు. దీనిని భర్తీ చేయడానికి అనేక చర్యలు తీసుకున్నారు. యూనియన్‌లోని వివిధ విభాగాల్లో అవసరానికి మించి పనిచేస్తున్న60మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించి 62 శాశ్వత పోస్టులను భర్తీ చేయడం ఎందుకని ప్రశ్నించారు. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా సీఐటీయూ సభ్యులు, తొలగించిన కార్మికులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాడుదాం

- రెండో రోజుకు లారీ యజమానుల సంఘం నిరసన



కుడితినిలో ప్లకార్డులతో లారీ యజమానులు

కంప్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని లారీ యజమానుల సంఘం నాయకులు పేర్కొన్నారు. టోల్‌గేట్ తొలగింపు, డీజిల్ రేటు తగ్గింపు తదితర అంశాలపై వ్యతిరేకిస్తూ రాష్ట్ర అధ్యక్షులు ఆదేశాల మేరకు ఇప్పుడు కుడితిని పట్టణం, పట్టణ చుట్టూ వుండే లారీల యజమానులు చేపట్టిన నిరసన గురువారానికి రెండోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారి రవాణా సంఘం అధ్యక్షుడు శివ మాట్లాడుతూ డీజిల్ ధరలు తగ్గించాలని, టోల్‌గేట్ ధర తగ్గింపు, బార్డర్ చెక్‌పోస్టు తీసేయాలన్నారు. రోడ్డును ట్యాక్స్, ఎఫ్ఎస్ఐ తగ్గించాలని లేకపోతే ముందుకు కొనసాగిస్తామన్నారు. లారీ ఓనర్లకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం కొనసాగిస్తామన్నారు. తమకు న్యాయం లభించే వరకు ఈ పోరాటం తప్పదని సూచించారు. ఇప్పటికే కుడితిని చుట్టు పక్కల చిన్నపాటి కర్మాగారాలు వద్ద వెళ్లి అక్కడే లారీ కలిసి తమ న్యాయపోరాటానికి మద్దతు తీయాలని కూడా అన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్ నాగేష్ స్వామి, భీమేష్, కనక పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

సిరుగుప్ప, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని టెక్కలకోట వైద్యాధికారి రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం తాలుకా పరిధిలో టెక్కలకోట పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిర కార్యక్రమం జరిగింది. యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులకు వైద్యులు ప్రశంసా పత్రాలు అందజేశారు.



రక్తదానం చేస్తున్న యువకులు

హోసూరు జోన్



అధికారులనుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

కలెక్టర్ తనిఖీలు

హోసూరు (కృష్ణగిరి), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బర్గూరు వ్యవసాయ గోడౌన్‌లో కలెక్టర్ దినేశ్‌కుమార్ అకస్మిక తనిఖీలు చేశారు. విత్తనాలు, విత్తన ఉత్పత్తులకు సంబంధించిన వివరాలు, రికార్డులను పరిశీలించారు. అధికారులకు పలు సలహా సూచనలు చేశారు. విధులలో నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కవిత, చిన్నస్వామి, ఇతర అధికారులు ఉన్నారు.



కావేరిపట్టణ బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించిన లిబరేషన్ సభ్యులు

ఇంటి స్థలాల కోసం ధర్నా

హోసూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లక్రితం ఆదిద్రావిడ వర్గాలకోసం ఉద్దేశించి కేటాయించిన భూమిని వాపసు తీసుకున్న ప్రభుత్వం తిరిగి అప్పగించాలంటూ లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళనాడు పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కావేరిపట్టణంలో గురువారం భారీ నిరసన చేపట్టారు. 1992లో కృష్ణగిరి జిల్లాలోని మలయందహళ్ళి గ్రామంలో ఆది ద్రావిడ వర్గానికి చెందిన 53 కుటుంబాలకు భూమి కేటాయించారు. అయితే 25 కుటుంబాలకు మాత్రమే ఉచిత భూమి పట్టాలు మంజూరు చేశారు. మిగిలిన ప్రాంతాన్ని 1996లో మరోవర్గం ఆక్రమించింది. దీన్ని జిల్లా యంత్రాంగం స్వాధీనం చేసుకుని అసలు లబ్ధిదారులైన ఆదిద్రావిడులకు అప్పగించడంలో జాప్యం చేస్తోంది. దశాబ్దాల పాటు నిర్లక్ష్యంతో గూడు కరువైందని లబ్ధిదారులు వాపోతున్నారు. నిరసనకు పార్టీ జిల్లా కార్యదర్శి మాదేశ్ నాయకత్వం వహించారు. వందలాదిమంది గిరిజనులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

హోసూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): హోసూరు జాతీయ రహదారిపై జూజువాడిలో వేసవి ఎండలనుంచి ఉపశమనం పొందేలా చలివేంద్రం ఏర్పాటు చేశారు. కృష్ణగిరి పశ్చిమ జిల్లా అన్నా ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసన్, హోసూరు ఉత్తర ప్రాంత లీగ్ కార్యదర్శి అశోక్ నాయకత్వంలో గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, పన్నీర్ సెల్వంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాగునీటితోపాటు మజ్జిగ, దోసకాయ, ద్రాక్ష, శీతలపానీయాలు పంపిణీ చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు భాగస్వామ్యులయ్యారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న ట్రేడ్ యూనియన్ నాయకులు

మానవత్వాన్ని ప్రదర్శించిన గొప్పనటుడు బళ్లారి రాఘవ

- వర్థంతి సభలో కళామందిరం ఈసీ బసవరాజు

బళ్లారి సిటీ,ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): బళ్లారి రాఘవ నిజజీవితంలోనూ మానవత్వాన్ని ప్రదర్శించారని రిటైర్డ్ లెక్చరర్, కళామందిరం ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బసవరాజు అన్నారు. బుధవారం బళ్లారి రాఘవ కళామందిరంలో రాఘవ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బళ్లారి రాఘవ 79వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బళ్లారి రాఘవ నాటకాలతో దేశ, విదేశాల్లో ఖ్యాతి సంపాదించారన్నారు. ఆయన విదేశాలకు వెళ్లారు. బెర్నాండ్ షాను కలిసినపుడు మీలాంటి నటులు మన దేశంలో పుట్టి ఉండాల్సిందని ఉద్వేగంగా అన్నారు. మహాత్మగాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్ బళ్లారి రాఘవ నాటకాలను చూసి మెచ్చుకున్నారు.ప్రపంచానికి కీర్తిని వ్యాపింప చేశారు.1880లో జన్మించిన రాఘవాచార్య 1946 ఏప్రిల్ 16న హంపి పౌర్ణమి నాడు మరణించారు. రాఘవ తన అద్భుతమైన కళ నేటికీ శాశ్వతంగా ఉంటుందని అన్నారు. ఈకార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు కే.చన్నప్ప, అధ్యక్షులు కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ పాటిల్, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రకాశ్,ధనుంజయ, రామాంజనేయులు, అమరేంద్రనాథ్ చౌదరి, శ్యామసుందర్, వెంకటేశులు, ప్రభాకర్,పొంపనగౌడ, యశ్వంత్‌రాజు, యశ్వంత్‌రాజు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాభిమానులు

ఆరో తరగతి ప్రవేశానికి అర్జీల ఆహ్వానం

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో 60మార్కులు పొందిన ఎస్సీ విద్యార్థులకు 6వ తరగతిలో ప్రిస్టేజియస్(ప్రతిష్ఠిత) పాఠశాలలో ప్రవేశానికి అర్హతా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి ఒక ప్రకటనలో కోరారు. గతంలో తెలిపినట్లుగా దరఖాస్తులు ఆన్‌లైన్ లో లేని కారణంగా ఆఫ్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అందుకు అవసరమై దరఖాస్తులు ఆయా తాలూకా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం నుంచి పొంది, భర్తీ చేసిన దరఖాస్తులు మే 3వ తేదీలోగా కార్యాలయంలో అందజేయాలన్నారు. మే 9వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని, మరిన్ని వివరాల కోసం 9480843023 నెంబరుకు ఫోన్‌చేసి వివరాలు పొందవచ్చని జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

మౌలానా ఆజాద్ మాదిరి పాఠశాలలో..

జిల్లా అల్పసంఖ్యాక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మౌలానా ఆజాద్ మాదిరి పాఠశాల(ఆంగ్ల మాధ్యమ)లో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్(సేవా సింధు) ద్వారా ఆర్జీలు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు సేవాసింధు పోర్టల్ లింక్ జ్టిఇటు//ట్రప్సి టఊచీజిం ట్రటరిజీఛ్పిటజ్బుటబ్బుజ్బు.జొరి.జీ లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలలో మైనార్టీ విద్యార్థులకు 75శాతం, ఇతర సామాజానికి చెందిన విద్యార్థులకు 25శాతం రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. జిల్లా పరిధిలో మూడు మైనార్టీ వసతి పాఠశాలలు ఉన్నట్లు, అందులో తెలిపారు. ఇందుకు సంబంధించి మరిన్ని వివరాల కోసం బళ్ళారి - 8861623814, మైనార్టీ మౌలానా ఆజాద్ మాడల్ పాఠశాల సండూరు-9480933730, కంప్లిలోని మౌలానా ఆజాద్ మాదిరి పాఠశాల 7353346069 నెంబరుకు ఫోన్‌చేసి వివరాలు పొందవచ్చు. లేదాన్ని మరిన్ని వివరాల కోసం మైనార్టీ సంక్షేమ జిలల్లా అధికారి కార్యాలయం లేదా, ఫోన్ 08393-200125/244 లేదా 8861623814 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.